అమ్మ సన్నిధిలో నిలువ నీడ కరువు

- నిరుపయోగంగా షెడ్లు
- సేదతీరే చోటులేక ఇబ్బందుల్లో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో అతిపెద్ద దేవాలయాల్లో రెండోస్థానంలో ఉన్న దుర్గ గుడిలో, భక్తులు కొద్దిసేపు విశ్రాంతి తీసుకునే భాగ్యం లేకుండా పోయింది. ఇంద్రకీలాద్రిపై ఉన్న అమ్మవారిని ప్రతిరోజూ 30వేల నుంచి 40వేల మంది భక్తులు దర్శించుకుంటారు. ఇక శుక్ర , శని, ఆది వారాలలో 50 వేల మందికి పైబడే భక్తులు వస్తుంటారు. ఇటీవల ముగిసిన ఆషాఢ మాసోత్సవాల వారాంతాల్లో అయితే రోజుకి 80 నుంచి 90 వేల మంది భక్తులు కూడా దర్శనం చేసుకున్నారు. ఇలా ఇంద్రకీలాద్రికి భారీగా తరలివస్తున్న భక్తులకు సరైన వసతి కల్పించడంలో మాత్రం దేవస్థాన అధికారులు విఫలమవుతున్నారు. వందలాది కిలోమీటర్లు ప్రయాణించి అమ్మవారి దర్శనం చేసుకున్న తర్వాత కొద్దిసేపు విశ్రాంతి తీసుకునే వీలులేకపోవడంతో భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కట్టడం..కూల్చడం..ఇదే పని...

దుర్గగుడిలో ఏటా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు.అయితే ఆ పనుల కారణంగా భక్తులకు ఏమాత్రం ప్రయోజనం ఉండటం లేదు. ఆలయ ప్రాంగణంలో షెడ్లు నిర్మించడం, ఒకటి, రెండేళ్లలో వాటిని తొలగించడం పరిపాటిగా మారింది. గతంలో లక్ష్మీగణపతి విగ్రహం వద్ద



మహామండపం దిగువన షెడ్డులో పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనాలు



తాళాలు వేసి ఉన్న ఏనుగుల షెడ్డు

క్యూలైన్లపై రెండేళ్ల కిందట ఏర్పాటు చేసిన షెడ్లను భారీ షెడ్డు నిర్మాణం పేరిట ఇప్పుడు తొలగిస్తున్నారు. అయితే తొలగించిన షెడ్లు మరోచోట ఉపయోగపడే రీతిలో కాకుండా స్క్రాప్‌కు మాత్రమే పనికి వచ్చేలా ముక్కలు ముక్కలు చేసేస్తున్నారు. ఇటీవల కమిషనర్ రామచంద్రమోహన్ తన పర్యటనలో ఈ విషయాన్ని గుర్తించి, ఆలయ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

నిరుపయోగంగా షెడ్లు..

అమ్మవారి దర్శనం అయిన తర్వాత మహామండపం 7వ అంతస్తు పైభాగంలో ఎక్కడా కూర్చోకుండా సెక్యూరిటీ సిబ్బంది విజిల్స్ వేసి భక్తులను కిందకు పంపేస్తున్నారు. తీరా మహామండపం దిగువకు చేరిన తర్వాత ప్రసాదాలు కొనుగోలు చేసి అక్కడైనా కొద్దిసేపు కూర్చుని ప్రసాదాలు తిందామనుకుంటే అక్కడా అదే పరిస్థితి. భక్తుల సౌలభ్యం కోసం నిర్మించిన షెడ్లలో వాహనాల పార్కింగ్‌కు అనుమతిస్తున్నారే తప్ప.. ఎవరినీ కూర్చునేందుకు అనుమతించడం లేదు. ఇక కనకదుర్గనగర్‌లోని షెడ్డులోనూ ఇదే దుస్థితి. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన వారికి ఇతర దేవాలయాల్లో తగిన వసతులు కల్పిస్తుండగా, దుర్గగుడిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. భక్తుల వసతి గురించి ఇటు ఆలయ అధికారులు, అటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ఏడాదిలో 10 నెలలు షెడ్డుకు తాళం...

ఇక కనకదుర్గనగర్ సమీపంలోని ఏనుగుల షెడ్డు ఏడాదిలో పదినెలలు తాళాలు వేసే ఉంటోంది. దసరా, భవానీ దీక్షల సమయంలో ఈ షెడ్డులో లడ్డూ ప్రసాదాలను తయారుచేస్తారు. ఇక మిగిలిన పది నెలలు గేట్లకు తాళాలు వేసి ఉంచుతున్నారు. ఈ షెడ్డు కేంద్రంగా గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. లడ్డూ తయారీ కేంద్రాన్ని ఈ ఏడాది మహామండపం పక్కన నిర్మించిన నూతన భవనంలోకి తరలించే అవకాశం ఉందని ఆలయ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్న నేపథ్యంలో ఈ ఏడాది దసరాలో ఈ షెడ్డును వినియోగించడం అనుమానమే. దీంతో నిరుపయోగంగా ఉన్న ఈ షెడ్డును శుభ్రం చేసి భక్తుల విశ్రాంతి కోసం కేటాయించాలని భక్తులు కోరుతున్నారు. టీటీడీ తరహాలో ఆయా షెడ్లలో లాకర్ల సదుపాయం కల్పిస్తే బాగుంటుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఆలయ అధికారులు ఏంచేస్తారో వేచి చూడాలి మరి.

క్లుప్తంగా

పాతశివాలయం హుండీ ఆదాయం రూ.3.85 లక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో హుండీల ద్వారా స్వామి వారికి రూ.3,85,092 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయంలోని ప్రధాన ఆలయంతో పాటుగా ఉపాలయాల వద్ద ఉన్న హుండీలన్నింటిని తెరిచి సుమారు 151 రోజులకు సంబంధించి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు పేర్కొన్నారు.

దుకాణాలకు వేలంపాట

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)కు సంబంధించిన దుకాణాల లీజుకు బహిరంగ వేలంపాటను వాయిదా వేసినట్లు తెలిపారు. శ్రీ విఘ్నేశ్వర రామ సహిత సత్యనారాయణ స్వామి వార్ల దేవస్థానంకు సంబంధించిన ఆరు దుకాణాలకు రెండింటికి మాత్రమే వేలంపాటలో పాల్గొన్నారు. మిగిలిన నాలుగు దుకాణాలకు ఎవరూ రాకపోవటంతో వాటి వేలంపాటను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

హజ్ యాత్రికులను మోసం చేస్తున్న కూటమి సర్కార్



షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే హజ్ యాత్రకు సంబంధించి కూటమి ప్రభుత్వం నాటకాలాడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్ విమర్శించారు. విజయవాడ వించిపేటలోని తన కార్యాలయంలో షేక్ ఆసిఫ్ మీడియాతో మాట్లాడారు. హజ్‌యాత్ర ఎంబర్కేషన్ పాయింట్ రద్దు చేయించి నేడు మళ్లీ దానిని సాధించినట్లు హడావుడి చేయటం కూటమి సర్కార్ డబుల్ గేమ్‌ను ముస్లిం సమాజం అర్థం చేసుకుంటోందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు హజ్ యాత్రికులకు లక్ష రూపాయలు ఇస్తామంటూ ఎన్నికల హామీలిచ్చి, తరువాత విజయవాడ నుంచి వెళ్లే వారికి మాత్రమే ఇస్తామంటూ ప్రకటించారని గుర్తు చేశారు. విజయవాడలో ఉన్న ఎంబర్కేషన్ పాయింట్‌ను రద్దు చేయాలని కేంద్రానికి లేఖ రాశారని, ఆమేరకు కేంద్ర ప్రభుత్వం ఎంబర్కేషన్ పాయింట్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించిందన్నారు. మళ్లీ ఇప్పుడు కేంద్రం విజయవాడకు ఎంబర్కేషన్ పాయింట్‌ను కేటాయిస్తే దానిని తామే సాధించినట్లు టీడీపీ హడావుడి చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విధమైన నాటకాలు టీడీపీకి మొదటి నుంచి అలవాటేనన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ముస్లిం సమాజం గమనిస్తోందన్నారు.

7 నుంచి శ్రీవారి సన్నిధిలో పవిత్రోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో పురాతన ఆలయమైన పాతబస్తీ బ్రాహ్మణవీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈ నెల ఏడవ తేదీ నుంచి 10వ తేదీ వరకూ స్వామి వారి సన్నిధిలో పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. ఏడో తేదీ గురువారం ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిరోజు శ్రీ విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షా స్వీకరణ, మేదినిపూజ, అంకురార్పణ, విఖసన కల్పసూత్రం, మంత్ర ప్రశ్నాష్టకం పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయి. ఎనిమిదో తేదీన అగ్నిప్రతిష్ఠాపన అధివాసం, పవిత్ర శయ్యాధివాసం, హోత్ర ప్రశంసన, సర్వదేవతాహ్వాన హోమాలు ఉంటాయి. తొమ్మిదో తేదీన స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృత అభిషేకం, వేదాంత దేశికులు, లక్ష్మీహయగ్రీవ, శ్రీ విఖనసాచార్యుల జయంతి కార్యక్రమాలు, దమకోత్సవం, శ్రీ విష్వక్సేన పూజ, వర్షవర్ష హోమాలు, సాయంత్రం స్వామి వారికి శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 10వ తేదీన పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ప్రధానార్చకులు వివరించారు.

8న టీటీడీ ఆధ్వర్యంలో సౌభాగ్య కార్యక్రమం



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 8వ తేది శ్రావణ శుక్రవారం సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో మహిళలకు సౌభాగ్య కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు దేవాలయాల పర్యవేక్షణ అధికారి మల్లికార్జునరావు తెలిపారు. టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం ఆయన బ్యానర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీటీడీ 60 అనుబంధ దేవాలయాల్లో శుక్రవారం మంగళాక్షింతలు, మహిళలకు పసుపు కుంకుమ, గాజులు అందజేస్తున్నట్లు తెలిపారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం ఏడు గంటల నుంచి విశేష అర్చనలు నిర్వహించి శ్రీవారికి సమర్పించిన సౌభాగ్య ద్రవ్యాలను భక్తులకు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ సీకే ప్రసాద్, దేవాలయ సిబ్బంది రోహిత్ పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు ప్రజల పాలిట శాపం



గాంధీహిల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

- మీటర్ల బిగింపు ఆపకుంటే మరో విద్యుత్ ఉద్యమం తప్పదు
- ఎన్నికలలో ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గాంధీ హిల్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రజల పాలిట శాపంగా మారుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ చార్జీల సర్దుబాటు, విద్యుత్ చార్జీల పెంపుదలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ గాంధీ హిల్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా జరిగింది. కార్యక్రమానికి సంఘీభావం తెలియజేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలను మోపుతోందన్నారు. అదానీ కంపెనీకి రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టేందుకు పూనుకున్నదని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు బిగించాలని ఇంటికి వస్తే ప్రతిఘటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు స్మార్ట్‌మీటర్లు బిగించటానికి వస్తే వాటిని ధ్వంసం చేయండని నాడు నారా లోకేష్ పిలుపునిచ్చారని, కానీ నేడు అదే వ్యక్తి ప్రభుత్వంలో ఉండి బిగింపు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ చార్జీల సర్దుబాటు విరమించుకోవాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అడుగడుగునా ప్రజలను మోసగిస్తోందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను అదానీ ఆఫీస్ నుంచి నియంత్రించే విధంగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారన్నారు. డిమాండ్‌ను బట్టి విద్యుత్ చార్జీల పెంపుదలను అప్పటికప్పుడు చేపట్టి ప్రజల నెత్తిన భారాలు వేయటానికి కుట్రలు పన్నారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర డెప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలని ప్రజలంతా గమనిస్తున్నారని సరైన సమయంలో సరైన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నేత రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బుద్దె రాజా, సీఐటీయూ నాయకుడు ఈవీ నారాయణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మాజీ కార్పొరేటర్లు గాదె ఆదిలక్ష్మి, డీవీ రమణబాబు, ఏఐటీయూసీ నాయకులు తాడిపైడియా, కొట్టు రమణారావు, సింగరాజు సాంబశివరావు, యడ్ల కృష్ణకిషోర్, అఫ్సర్, రాయన గురునాథం, మహిళా సమైఖ్య నాయకులు పంక ఝాన్సీ లక్ష్మి, చింతాడ లక్ష్మి, సీఐటీయూ నేతలు కె.సూరిబాబు, గాదె వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల యజమానులు ఎక్కడున్నా పన్ను కట్టాల్సిందే

వీఎల్‌టీ పన్ను బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఖాళీస్థలాల పన్ను బకాయిలపై వీఎంసీ రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వీఎంసీ కమిషర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యలయంలోని తన చాంబర్లో మంగళవారం వేకెంట్ ల్యాండ్ టాక్స్ కమిటీ మీటింగ్ జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాల పన్ను వసూలు చేయటం కోసం విజయవాడ నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగంతో పాటు జిల్లా రెవెన్యూ శాఖ, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సమన్వయం అవసరమని అన్నారు. ఖాళీ స్థలాల పన్నులు, బకాయిల వసూళ్ల కోసం కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారని, ఈ మేరకు వీఎంసీ వేకెన్ట్ ల్యాండ్ టాక్స్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీకి ఇది మొదటి సమావేశమని, ఖాళీ స్థలాల పన్నుల డిమాండ్ గత ఏడాది రూ.237 కోట్లు ఉంటే వసూలు మాత్రం కేవలం రూ.19 కోట్లు మాత్రమే వస్తోందని తెలిపారు. బకాయిలు ఉన్న ఖాళీ స్థలాల యజమానుల వివరాలు తెలియకపోవటం వల్ల వసూలు చేయలేకపోతున్నారని రెవెన్యూ అధికారులు కమిషనర్‌కు వివరించగా అందుకోసమే ఈ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీలో వీఎంసీ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగం నగర పరిధిలోని ఖాళీ స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్ వివరాలు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకి అందించిన వెంటనే స్థలం విక్రయాల డాక్యుమెంట్ ఆధారంగా, యజమానుల వివరాలు తెలుసుకోవడమే కాకుండా వారు ఆ డాక్యుమెంట్లో సమర్పించిన అడ్రస్ ఆధారంగా వారికి నోటీసులు జారీ చెయ్యాలని సమావేశంలో చర్చించారు. ఖాళీ స్థలాల పన్ను బకాయల జాబితాను సర్కిల్, వార్డ్, సచివాలయం వారీగా విభజించి ప్రతి ఖాళీ స్థలం యజమానిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని, విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోగల ఖాళీ స్థలాల యజమానులు ఎక్కడున్నా సరే వారికున్న ఖాళీ స్థలాల పన్ను బకాయిలను చెల్లించాలని, లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ కె.చైతన్య, జిల్లా రిజిస్ట్రార్ పి.వి.వి దుర్గాప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, శ్రీనివాస్, ఏయూటీ శర్మ, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్‌బాబు పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తో క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించవచ్చు

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవైరావు



క్యాన్సర్ స్క్రీనింగ్‌కు శిక్షణ ఇచ్చిన వారితో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవై రావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో సైతం స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించవచ్చునని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు అన్నారు. అప్పుడు వ్యాధిని నయం చేయడం సులభతరం అవుతుందన్నారు. జిల్లాలోని నాన్ కమ్యూనికల్ డీసీజెస్ సెల్ సభ్యులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, ప్రాథమిక, ఏరియా ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, దంత వైద్యులకు క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించడంపై వైద్య కళాశాలలో మంగళవారం జిల్లా స్థాయి నాలుగో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో వైద్య కళాశాలకు చెందిన 8 విభాగాలకు చెందిన స్పెషలిస్టులు క్యాన్సర్ స్క్రీనింగ్ విధానాలు, గుర్తింపు మార్గాలు, చికిత్సకు ముందు చర్యలు, రోగులకు మానసికంగా ధైర్యం చెప్పే పద్ధతులు వంటి వాటిపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల వద్ద స్క్రీనింగ్ టెస్టులు ఎలా నిర్వహించాలో తెలియజేశారు. ఒక వేళ వ్యాధి నిర్ధారణ అయితే వారికి బ్రేకింగ్ బ్యాడ్ న్యూస్ పద్ధతి ద్వారా సానుభూతితో ఎలా వివరించాలో తెలియజేశారు. శిక్షణ ఇచ్చిన వారిలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ గోవింద్, సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కేశవచంద్ర, ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ కె.రవి, మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ విభాగంనుంచి డాక్టర్ సుధాకర్, జిల్లా ఎన్‌సీడీ అధికారి డాక్టర్ మాధవీనాయుడు పాల్గొన్నారు.

హాస్పిటల్ వ్యర్థ నిర్వహణ పరిశీలన



వన్‌టౌన్‌లోని షేక్ రాజా ఆస్పత్రి వద్ద పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ నిర్వహణలో ఉన్న హాస్పిటల్ వ్యర్థ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం కొత్తపేట, వన్‌టౌన్, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పర్యటించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ కొత్తపేట, షేక్ రాజా హాస్పిటల్‌లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ ఎలా నిర్వహిస్తున్నారో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హాస్పిటల్ నుంచి వచ్చే వ్యర్థాలను విభజించి, నిబంధనల ప్రకారం వాటిని సేకరించాలని అధికారులకు సూచించారు. బయోమెడికల్ వ్యర్థాలను రంగులతో కూడిన బ్యాగుల్లో వేసి, సకాలంలో వాటిని రవాణా చేస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే, అది ప్రజారోగ్యానికి పెనుముప్పు వాటిల్లుతుందని, ప్రతి హాస్పిటల్‌కు క్లినిక్ నిబంధనల మేరకు నిర్వహణ జరగాలని ఆదేశించారు. అనంతరం ఆయన ఎంజీ రోడ్డులోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ వేడుకలకు వీఎంసీ కల్పించే సౌకర్యాల్లో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యనారాయణ, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో రోజురోజుకు పెరుగుతున్న నివాస గృహాలు, అపార్ట్‌మెంట్ల కారణంగా చెత్త సేకరణ అధికంగా ఉంటున్నా అందుకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు సంఖ్య మాత్రం పెరగటం లేదని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజ అన్నారు. మంగళవారం విద్యాధరపురంలోని 44వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఒక వైపు రిటైరయిన వారు, మరో వైపు చనిపోయిన వారు, ఇంకో వైపు అనారోగ్యంతో విధులకు హాజరు కాలేని పరిస్థితుల్లో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని, దాంతో ఉన్న కార్మికులపై పని భారం పెరిగిపోయి అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీసం మరో 1500 మంది పారిశుద్ధ్య కార్మికులను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్, గౌరవ అధ్యక్షుడు జక్కి జేమ్స్, కోశాధికారి తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహారంలో తక్కువ ఉప్పు ఆరోగ్యకరం

ప్రత్యామ్నాయాలపై ఐఎంఏలో వర్క్‌షాపు



ఆహారంలో ఉప్పు తగ్గించాలని పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీఐ, ఐఎంఏ, ఇతర వైద్య నిపుణులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆహారంలో తక్కువ ఉప్పు తీసుకోవడం ఆరోగ్యకరమని పలు విభాగాలకు చెందిన నిపుణులు వెల్లడించారు. చెన్నైకి చెందిన సేపియన్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉప్పు తగ్గింపు- తక్కువ ఉప్పు ప్రత్యామ్నాయాలపై మంగళవారం వర్క్‌షాపు జరిగింది. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా(ఏపీఐ-ఏపీ) , ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ-ఏపీ), న్యూయార్క్‌కు చెందిన ఎన్‌జీఓ సంస్థ రిసల్వ్ టు సేవ్ లైవ్స్ సహకారంతో ఈ వర్క్‌షాపు నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది వైద్య నిపుణులు రక్తనాళాలు, గుండె, మూత్రపిండాలు, ఎముకలు వంటి వాటిపై ఉప్పు ప్రభావాన్ని వివరించారు. ఖర్చుతో కూడుకున్న తక్కువ ఉప్పు ప్రత్యామ్నాయాల పాత్ర, లభ్యత గురించి చర్చించారు. ప్రజలకు అవగాహన కలిగించడం, తక్కువ సోడియం ఉత్పత్తులను సంస్కరించడానికి ఆహార పరిశ్రమల ప్రాముఖ్యత, ఆవశ్యకత, అధిక ఉప్పు పదార్థాలపై పన్ను విధించడంపై ప్రభుత్వ విధానాలు వంటి అంశాలపై చర్చించారు. ఉప్పుకు ఆహార లేబులింగ్ వంటి కొన్ని ముఖ్యమైన అంశాలు వైద్య, పోషకాహార నిపుణులు తక్కువ ఉప్పు వంటకాలను సూచించడం వంటివి చేయాలని అభిప్రాయ పడ్డారు. సదస్సులో అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా జిల్లా చైర్మన్ డాక్టర్ సీహెచ్ మనోజ్‌కుమార్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష , కార్యదర్శులు డాక్టర్ జి.నందకిషోర్, డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, నెఫ్రాలజిస్టు డాక్టర్ ఎడ్విన్, సేపియన్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజన్ రవిచంద్రన్, కార్డియాలజిస్ట్ డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం తేవాలని భర్త, అత్త, మామ, ఆడపడుచు వేధిస్తున్నారని ఓ మహిళ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భవానీపురం హెచ్‌బీ కాలనీకి చెందిన షేక్ మెహజాబి కి మూడేళ్ల క్రితం మహమ్మద్ ఇమ్రాన్‌తో వివాహమైంది. వివాహ సమయంలో కట్నం కింద రూ.4 లక్షల నగదు, 8 కాసుల బంగారం, రూ.2 లక్షలు సారె కింద ఇచ్చారు. కొంతకాలంగా అదనపు కట్నం తేవాలని భర్త, అత్త, మామ, ఆడపడుచు వేధిస్తున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరంపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాలనీలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై కొత్తపేట పోలీసులు మంగళవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.98,570 నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీలోని సప్తగిరి బ్యాంక్ సమీపంలో జమ్మిచెట్టు వద్ద ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఆ ఇంటిపై దాడి చేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ బాలిక అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట మహాలక్ష్మి గుడి ప్రాంతంలో ఉంటున్న దంపతులకు ముగ్గురు సంతానం. వారి కుమార్తె(17) 9వ తరగతి వరకు చదివి మానేసింది. ప్రస్తుతం వించిపేట గాంధీబొమ్మ సెంటర్‌లో ఓ బ్యూటీ పార్లర్‌లో శిక్షణ పొందుతోంది. సోమవారం ఉదయం పార్లర్‌కు వెళ్లిన బాలిక మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి, తిరిగి పార్లర్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రం తమ్ముడు అక్క కోసం ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు పార్లర్‌కు వెళ్లి చూశారు. అయితే పార్లర్ మూసివేసి ఉండటంతో బాలిక కోసం స్నేహితులు, బంధువుల ఇళ్లలో విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మహిళపై అసభ్యకరంగా దూషించి దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను అసభ్యకరంగా దూషించడమే కాకుండా స్టీల్ గిన్నెతో దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు జోడుబొమ్మల సెంటర్ వీరయ్య వీధిలో కంటిపాము పద్మ, సూరి అప్పారావు దంపతులు నివాసం ఉంటున్నారు. పద్మ కృష్ణవేణి కాంప్లెక్స్‌లో స్లీపర్‌గా పని చేస్తుంటుంది. సోమవారం రాత్రి పద్మ ఇంటి ముందు నివాసం ఉండే బంగారు శ్రీనివాసు మద్యం తాగి వచ్చాడు. పద్మను నోటికి వచ్చినట్లు తిట్టడమే కాకుండా చేతిలో ఉన్న స్టీల్ గిన్నెను ఆమెపై విసిరేశాడు. దీంతో పద్మ తలకు గాయం కావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కళాశాలలో నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తి చేయండి

మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు అహ్మద్ షరీఫ్



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ (ఉర్దూ) కళాశాలను మండలి మాజీ చైర్మన్, మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్ మంగళవారం సందర్శించారు. కళాశాలలో అడ్మిషన్లు పెరగడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో రెండు వృత్తి విద్యా కోర్సులను ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కోర్సుల వలన మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సుజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాలలో ఏర్పాటు చేస్తున్న సైన్స్ ప్రయోగశాల గురించి అడిగి తెలుసుకుని త్వరితగతిన విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కళాశాలకు సంబంధించి ప్రహరీ గోడ, మొదటి అంతస్తులో నిలిచిపోయిన మూడు తరగతి గదుల నిర్మాణం, పైకప్పు పనులకు సంబంధించి సర్వశిక్ష అభియాన్ కమిషనర్‌తో షరీఫ్ చర్చించారు. రెండు మూడు రోజుల్లో ఆయా పనులకు అంచనాలను రూపొందించాలని, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించండి

ఈ సందర్భంగా షరీఫ్ కళాశాల అధ్యాపకులతో సంభాషిస్తూ పశ్చిమ నియోజకవర్గంలోని పేద విద్యార్థినీ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కోరారు. ముఖ్యంగా ఈఏపీసీఈటీ, నీట్ వంటి కోర్సులకు సంబంధించిన గైడెన్స్ వారికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హాఫీజ్ షేక్ అహ్మద్ పాల్గొన్నారు. అనంతరం భవానీపురం ఐరన్ యార్డ్‌లోని గురుకుల (మైనార్టీ బాలికలు) రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌కు సొంత భవనం లేనందున పక్కా భవన నిర్మాణానికి సహకరించాలని మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.